ప్రజాశక్తి

శుక్రవారం 22 నవంబర్ 2024 5 విజయనగరం



భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు

ప్రజాశక్తి- భోగాపురం



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెడుతున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు గురువారం అసెంబ్లీలో ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఈ పేరును ప్రతిపాదించగా సిఎం చంద్రబాబు బలపర్చి ప్రకటించారు. ఇక నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా పిలవాలని ఆయన తెలిపారు. అనంతరం అల్లూరి పోరాట పటిమను అసెంబ్లీలో గుర్తు చేసుకున్నారు.ఇదిలా ఉండగా విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

పచ్చని పంట భూముల్లో ఆయుధ చిచ్చు

1511 ఎకరాలకు ఎసరు

ఆందోళనలో బాడంగిలోని ఆరు గ్రామాలు

నావికాదళ యుద్ధ సామగ్రి నిల్వ కేంద్రం ఏర్పాటు పేరిట పచ్చటి పైరు భూములు లాగేసుకుని రైతుల బతుకుల్లో చిచ్చురేపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. దీంతో, బాడంగి మండలంలోని ఆరు గ్రామాల చెందిన ప్రజానీకం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రయత్నం చాలా కాలంగా చేస్తున్నప్పటికీ ఈసారి తప్పక ముందుకు వెళ్లాలని నావికాదళం, అటు ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. ప్రభుత్వ కార్యాచరణ ముందుకు సాగితే ఈ గ్రామాల్లో వందలాది మంది రైతులు సారవంతమైన భూములు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పూడివలస గ్రామం ఉనికికే ముప్పవాటిల్లే ప్రమాదం ఉంది.



బాడంగి సమీపంలో సాగవుతున్న పచ్చని వరి పొలాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సుమారు 90ఏళ్ల క్రితం అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం బాడంగి మండలంలోని డొంకినవలస రైల్వే స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ముగడ రెవెన్యూ పరిధిలో సుమారు 247 ఎకరాల్లో ఎయిర్ స్ట్రిప్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో నేవీ సాయుధ దళాలకు సామగ్రి, వారికి అవసరమైన ఇతర సరుకులు ఇక్కడి నుంచే సప్లై చేసేవారట. రెండో ప్రపంచ యుద్ధంనాటి సమయంలో ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహించేవారని చెబుతుంటారు. 1946లో ఈ ఎయిర్ స్ట్రిప్‌ను మూసివేశారు. ఇదే స్థలంలో నావికాదళ యుద్ధ సామగ్రి నిల్వ కేంద్రం (ఎన్‌ఎడి) 1758 ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు గడిచిన మూడు దశాబ్దాలుగా ప్రయత్నిస్తోంది. ఇందుకనుగుణంగా గతంలో అనేక సార్లు సర్వేచేపట్టారు. ఈ భూమి సరిపోయే పరిస్థితి లేకపోవడంతో ఇతర ప్రాంతాలను సర్వే చేసినప్పటికీ ఆయా ప్రాంతాల్లో తీవ్రంగా ప్రతిఘటించడంతో తిరిగి ఇక్కడికే వచ్చారు.

సాయుధ డిపో వల్ల స్థానికులకు ఉపయోగం ఎంత?

ప్రజా ప్రయోజనం కోసం ఎక్కడైనా భూములు త్యాగం చేయాల్సివస్తే భూమికి బదులు భూమి, పరిహారం, అక్కడ ఏర్పాటు చేయబోయే పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. కానీ, ఇక్కడ ఏర్పాటు చేస్తామంటున్న నావికాదళ యుద్ధ సామగ్రి నిల్వ కేంద్రం ఏర్పాటు వల్ల ఇక్కడి ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరే పరిస్థితి ఉండదు. ఇప్పటికే విశాఖలో ఓ నావికాదళ సాయుధ డిపో ఉంది. ఇందులో మందుగుండు సామగ్రి, క్షిపణులు, టోర్పెడోలు, ఇతర రసాయన ముడిసరుకుల నిల్వ, సరఫరా ఇక్కడి నుంచే సాగుతుంది. దీనికి అనుబంధంగానే బాడంగి మండలంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. పైగా ఈ డిపో చుట్టుపక్కల ఇంతకు ముందులా తిరగడానికి వీలు ఉండదు. అనేక ఆంక్షల నడుమ ప్రజానీకం తమ సొంత ఊళ్లలోనే మెసులుకోవాల్సిన దుస్థితి దాపురించ నుంది.

దత్తిరాజేరు, భోగాపురం ప్రతిఘటనతో బాడంగి

ఈ సాయుధ డిపో ఏర్పాటుకు గతంలో దత్తిరాజేరు, భోగాపురం మండలాల్లోనూ ప్రయత్నించారు. అక్కడి ప్రజానీకం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో అప్పట్లో ఆయా ప్రభుత్వాలు వెనక్కి తగ్గాయి. 2016లో దత్తిరాజేరు మండలంలో ఏర్పాటు చేసేందుకు నావికాదళ, రెవెన్యూ అధికారులు గుట్టు చప్పుడుగా సర్వే చేపట్టారు. సిపిఎం ఆధ్వర్యాన పాచలవలస, మరడాం, కృష్ణాపురం, విద్యావాసి, భోజరాజుపురం, గుచ్చిమి, ఎస్ చింతలవలస ప్రజానీకం అప్పట్లో తీవ్రంగా ప్రతిఘటించారు. అంతకు ముందు 2012లో భోగాపురంలోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. దీంతో, ఆయా చోట్ల ఏర్పాటు చేయాలన్న నిర్ణయం నుంచి అప్పటి ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

వేగావతి ఒడ్డే దొరికిందా?

ఇప్పటికే ఉన్న ఎయిర్ స్ట్రిప్ 247 ఎకరాల్లో ఉంది. ప్రభుత్వం భావిస్తున్న సాయుధ డిపో ఏర్పాటు చేయాలంటే ఇంకా 1758 ఎకరాలు అవసరం కానున్నట్లు సమాచారం. మిగిలిన 1511 ఎకరాలు పాలేరు, ముగడ, పూడివలస, మల్లంపేట, రామచంద్రాపురం, కోడురు రెవెన్యూ గ్రామాల పరిధిలో సేకరించాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. పది రోజుల క్రితం నావికాదళం, సాయుధ డిపో, రెవెన్యూ అధికారులు ఈ భూములను పరిశీలించారు. వాస్తవానికి ఈ భూములన్నీ వేగావతి నది ఒడ్డున ఉన్నాయి. దీంతో, బోరు నీరు తక్కులోతులోనే అందుబాటులో ఉంటాయి. నది నుంచి కూడా నీరు తోడుకుంటూ ఈ ప్రాంతవాసులు వరి, చెరకు సాగు చేస్తున్నారు. ఈ సాయుధ డిపో ఏర్పాటుతో రైతులంతా తమ జీవనాధారం పోతుందని ఆందోళన చెందుతున్నారు.

లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి ● ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విశాఖలో న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు గురువారం సాయంత్రం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ప్రదర్శన నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కో-కన్వీనర్ భారతి మాట్లాడుతూ రోజురోజుకు రాష్ట్రంలో అత్యాచార ఘటనలు పేరుకుపోతున్నాయని, నిన్నటికి నిన్న విశాఖలో లా విద్యార్థిని ప్రేమ పేరుతో వంచించి అత్యాచారానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీటికి కారణమైన డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలను రాష్ట్రంలో నిరోధించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాము, జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్, సహాయ కార్యదర్శి పి రమేష్, శిరీష నాయకులు సోమేష్,రాజు ,రాహుల్ ,కుమార్ స్వామి ,మురళి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతినిస్తున్న ఐద్వా, జెవివి సమతా నాయకులు

హత్యలు, అత్యాచారాల నుంచి కాపాడాలి

రోజురోజుకూ పెరుగుతున్న అత్యాచారాలు, హత్యల నుంచి మహిళలను, చిన్నారులను కాపాడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, జెవివి సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల కోరారు. ఈమేరకు గురువారం డిఆర్ఒ శ్రీనివాసమూర్తికి వినతి అందజేశారు. జిల్లాలో రోజురోజుకూ అత్యాచారాలు పెరుగుతున్నా బాధితులకు రక్షణ కల్పించడంలో పోలీసులు, ప్రభుత్వం విఫలమవుతున్నారని పేర్కొన్నారు. మత్తుపదార్థాలు, గంజాయికి అడ్డాగా విజయనగరం ,విశాఖ పట్నం, మన్యం జిల్లాలు ఉన్నాయని, వెంటనే మాదక ద్రవ్యాలను అరికట్టాలని కోరారు. మహిళలపై హింస నిరోధక చట్టం, పోస్కో, నిర్భయ, దిశ,చట్టాలున్నా వాటిని పగడ్బంధీగా అమలు చెయడంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందిందని అన్నారు.

పోలీసుశాఖలో పారదర్శకంగా బదిలీలు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో వివిధ హోదాల్లో పని చేస్తూ, ఐదేళ్లపూర్తి చేసుకున్న ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సిలింగు నిర్వహించి, పారదర్శకంగా బదిలీలు ప్రక్రియ చేపట్టారు.17మందిఎఎస్ఐలు, 59మంది హెచ్‌సిలు, 137 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కౌన్సిలింగుకు హాజరైన పోలీసు సిబ్బంది పుట్టిన తేదీ, సీనియారిటీ ప్రాతిపదికగా ఒకలిస్టును తయారు చేసి, పోలీసు కార్యాలయంలో కంప్యూటరు స్క్రీన్ మీద ప్రదర్శించారు. ఒక్కొక్కరిగా కౌన్సిలింగ్‌కు పిలిచి వారు కోరుకున్న స్థానాలకు బదిలీ చేశారు. బదిలీ ప్రక్రియలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఒ పి.శ్రీనివాసరావు, ఆఫీసు పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు విలువలతో కూడిన విద్య అవసరమని, జీవితంలో విజేతలు గా నిలవాలంటే విలువలు అవసరమని మాజీ కేంద్ర మంత్రి పి.అశోకగజపతిరాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో 'గ్రంథాలయ ఆవశ్యకత' అనే అంశంపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికీ గురువారం ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానానికి వెళ్లేందుకు, ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్ద బడేందుకు విద్యార్థి దశ చాలా కీలకమని అన్నారు. విద్యతో బాటు ప్రతీ ఒక్కరికి క్రమశిక్షణ, సమయపాలన అవసరమని, నిరంతర సాధన ద్వారానే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని సూచించారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎర్నాయుడు, ఉపాధ్యక్షులు కె.దయానంద్, గౌరవ అధ్యక్షులు నాలుగెస్సుల రాజు, మోనంగి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాస్పత్రిలో కేన్సర్ వైద్యసేవలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్రాస్పత్రిలో కేన్సర్ వైద్యసేవలు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలో కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని చాలా కాలంగా ప్రజాసంఘాలు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో గురువారం ఆస్పత్రిలో ఓపిసేవలను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు, మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల ప్రారంభించారు. మెడికల్ ఆంకాలజీ, ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు జరిపిన తరువాత చికిత్స అందిస్తామని తెలిపారు. ఎవరికైతే కేన్సర్ పై సందేశాలు ఉంటాయో అటువంటి వారు ఆస్పత్రికి వచ్చి నిర్ధారణ పరీక్షలు చేసుకోవచ్చన్నారు. ప్రాథమిక చికిత్స ఇక్కడ అందిస్తామని, ఇంకా తీవ్రమైతే విశాఖ రిఫర్ చేస్తామని తెలిపారు. ఈ విభాగాల్లో హెచ్ఒడిగా డాక్టర్ దేవి మాధవి, గైనిక్ విభాగంలో డాక్టర్ సుజాత, డెంటల్ విభాగంలో డాక్టర్ కామేశ్వరరావు, బ్రెస్ట్ కేన్సర్ విభాగంలో



కేన్సర్ ఒపి విభాగాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్, సూపరింటెండెంట్

డాక్టర్ చైతన్యబాబు, జనరల్ సర్జన్ టీం సేవలందిస్తారని తెలిపారు. ప్రతి మంగళవారం, గురువారం ఒపి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ శివకుమార్, వివిధ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

సాహిత్యంతో ఒత్తిడి దూరం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సాంకేతికత పెరిగిన కొద్దీ జీవితం చాలా ఇరుకైపోయిందని, ఒత్తిడి నుంచి బయటపడాలంటే సాహిత్య ఆవశ్యకత ఎంతైనా ఉందని, దానికి తగిన సమయం కేటాయిస్తూ చదవడం, రాయడం చేయాలని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు జిఎస్ చలం అన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రేఖ అధ్యక్షతన తెలుగు కార్యశాల జరిగింది. విద్యార్థులకు రచనా వ్యాసంగంలో మెలకువులను తెలియజేశారు. ప్రముఖ కవి మానాపురపు రాజా చంద్రశేఖర్ మాట్లాడుతూ కాలంతో పాటు మనిషి ప్రయాణంలో సాహిత్యం ఒక సృజనాత్మక ప్రక్రియ అన్నారు. సాహిత్యం మనిషిలో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుందని చెప్పారు.



మాట్లాడుతున్న సాహితీవేత్త జిఎస్ చలం

అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి రత్నాల బాలకృష్ణ సాహిత్య ఆవశ్యకత గురించి వివరించారు..భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జివిఎస్ జైపాల్‌రావు మాట్లాడుతూ కవి సామాజిక బాధ్యత ఏమిటో విద్యార్థులకు వివరించారు. ప్రముఖ జానపద కవి బద్రి కూర్మారావు ఉత్తరాంధ్ర శైలిలో అనేక జానపద గీతాలు ఆలపిస్తూ, విద్యార్థులను ఉర్రూతలూగించారు. తెలుగు విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రమాగీతాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల, మున్సిపల్, డివిజన్ స్థాయిల్లో వినతుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఇకపై ప్రతి సోమవారం మండల, మున్సిపల్, డివిజన్ స్థాయిల్లో ప్రజా వినతుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎంపిడిఒ, తహశీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ తదితరులతో కూడిన మండలస్థాయి సమన్వయ కమిటీ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మండల కేంద్రంలో నిర్వహించే మండల స్థాయి అధికారులంతా తప్పని సరిగా పాల్గొనాలని తెలిపారు. డివిజన్ మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసేందుకు కేఆర్‌ఆర్సి ఎస్‌డిసి సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు.

సర్క్యులర్‌ను మార్చాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

విజయనగరంకోట : 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూ ఎఫ్ జోనల్ అధ్యక్షులు వి. రాములు, విజయనగరం డిపో కార్యదర్శి ఎం.చంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విజయనగరం డిపో వద్ద యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 70, 71 లను సమూలంగా మార్చాలన్నారు, డే అవుట్, నైట్ అవుట్ అలవెన్సును, టిఎ బిల్లులు, ఇతర అలవెన్సులు చెల్లించాలన్నారు. ఆఫీస్ సిబ్బంది, సూపర్‌వైజర్లపై పనిభారం తగ్గించాలన్నారు. డిపో కమిటీ సభ్యులు కె.ఆర్ కుమార్, బిఎస్ రావు, జిఎస్ నారాయణ, ఎస్ బి నాయుడు, ఎస్‌కె రఫీ, కార్మికులు పాల్గొన్నారు.

అశోక్‌ను కలిసిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గండ్రేటి సత్యనారాయణ గురువారం మర్యాద పూర్వకంగా కేంద్ర మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజును కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు , కార్యదర్శి గంటా పోలినాయుడు, అధ్యక్షులు సారిక సర్పంచ్ ఈశ్వరరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, టిడిపి నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌ను కలిసిన సత్యనారాయణ



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు, పాడిరైతులు

తగ్గించిన పాల సేకరణ ధర వెంటనే పెంచాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు

ప్రజాశక్తి-రామభద్రపురం

విశాఖడెయిరీ యాజమాన్యం తగ్గించిన పాల సేకరణ ధరను ఉపసంహరించుకుని వెంటనే పెంచాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విశాఖ డెయిరీ కార్యాలయం వద్ద ఆ సంఘం నాయకులు, సిఐటియు నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు అనేక కష్ట నష్టాలు భరించి పాడినే జీవనాధారంగా భావించి పాలను సరఫరా చేస్తున్నారన్నారు. అట్టి రైతులను నట్టేట ముంచేలా విశాఖ డెయిరీ యాజమాన్యం లీటరుకు 4నుంచి 5 రూపాయలు ధర తగ్గించడం దారుణమన్నారు. ఏటా డెయిరీ లాభాల్లో ఇవ్వాల్సిన బోనస్ కూడా అరకొర చెల్లించి రైతుకు కుచ్చుటోపీ పెడుతున్నారని విమర్శించారు. సహకార రంగాన్ని నిర్వీరం చేసి కంపెనీ చట్టం అమలు చేసి సొంత లాభాలకు బాటలు వేసుకున్నారని అన్నారు. ఇప్పటికైనా స్పందించి రైతు కష్టాన్ని గుర్తించి ఆవుపాలకు రూ.50, గేదె పాలకు రూ.80 చొప్పున చెల్లించాలన్నారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో జోక్యం చేసుకొని అసెంబ్లీ సమావేశం లో తీసుకున్న నిర్ణయం మేరకు సభా సంఘాన్ని ఏర్పాటు చేసి అవినీతిని వెలికి తీసి విచారణ జరపాలన్నారు. డిసెంబర్ 2న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమాన్ని గాజువాక నుంచి ప్రారంభిస్తున్నామని, పాడి రైతులంతా జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సేల్స్ మేనేజర్ రాజుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఆదినారాయణ, బలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ టీం కోచ్‌గా లీలాకృష్ణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 26 నుంచి 30 వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరుగు అండర్ 17 జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొను ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్‌గా పి. లీలాకృష్ణ నియమితులయ్యారు. ఈయన పసుపాం జెడ్‌పి హైస్కూలులో పీడీగా పనిచేస్తున్నారు. కోచ్‌గా ఎంపికైన లీలాకృష్ణను పాఠశాల హెచ్‌ఎం ఆర్. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.



24న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఈనెల 24న జిల్లా స్థాయి ఓపెన్ చదరంగం పోటీలు శ్రీ చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం, ఫైర్‌చెస్ స్కూల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు చదరంగం అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు కెవి జ్వాలాముఖి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ఓపెన్ విభాగంలో రూ.5వేలు నగదు బహుమతి, అండర్-7,9,11,13,15 పిల్లల విభాగంలో ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు apchess.org websiteలో పేర్లు నమోదుకు 9573415618 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి : మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో నగరపాలక సంస్థ అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్లలో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మంచి పాలన అందించి అందరి మన్ననలను పొందాలన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

సిబ్బంది పనితీరులో మార్పు రావాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజారోగ్య సిబ్బంది పనితీరులో మార్పు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. గురువారం ప్రజారోగ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, శానిటరీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డ్ లుగా తయారవుతున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేసి శుభ్రపరచాలని చెప్పారు. కాలువలపై పలకలు వేసి మురుగును కూడా తీయడానికి వీలు లేకుండా కొందరు తయారు చేస్తున్నారని, వాటి పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య పనివారలు తప్పనిసరిగా ఆప్రాన్లు ధరించి విధులు నిర్వర్తించాలన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ శతశాతం జరగాలన్నారు.

చెత్తబుట్టలు వినియోగించండి : కమిషనర్

ప్రజలు చెత్తబుట్టలు వినియోగించి పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కమిషనర్ పి.నల్లనయ్య కోరారు. గురువారం నగరంలో వివిధ ప్రాంతాలలో పర్యటించిన కోట ప్రాంతంలో బొంకుల దెబ్బ మీద విక్రయాలు సాగిస్తున్న కూరగాయల వర్తకులకు తగు సూచనలు చేశారు. చెత్తాచెదారాలను ప్రధాన రహదారిపై వేయకుండా డస్ట్ బిన్లు ఉపయోగించాలని చెప్పారు. అనంతరం గుణుపూరుపేట లో ఉన్న డంపింగ్ యార్డ్ ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న తడి చెత్త పొడి చెత్త వర్గీకరణ విధానాన్ని పరిశీలించారు.

1100 కేజీల నిషేధిత ప్లాస్టిక్ జిందాల్‌కు తరలింపు

నగరపాలక సంస్థలో గత కొన్ని రోజులుగా వివిధ ప్లాస్టిక్ షాపులపై దాడులు నిర్వహించి, స్వాధీనం చేసుకున్న 1100 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విశాఖలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు గురువారం తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురజాడ స్మారక జిల్లా కేంద్రంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ నారాయణరావు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను సృజనాత్మకను వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం వంటి అంశాల్లో పాల్గొని జూనియర్ సబ్ జూనియర్ విభాగాల్లో విజేతలుగా విద్యార్థులు ఎం.జస్వంత్, సిహెచ్ .సిద్ధార్థ నాయుడు, ఎం. హేమ పార్వతి, టి. నవ్య శ్రీ, ఎం.సాత్విక్ నిలిచారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ స్కూలు కరస్పాండెంట్ నారాయణరావు

23, 24తేదీల్లో ఓటు నమోదు

నెల్లిమర్ల: ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణకు సంబంధించి ప్రత్యేక క్యాంపెయినింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బి. సుదర్శనరావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాధరావు గురువారం ప్రకటనలో తెలిపారు. క్యాంపెయినింగ్ కార్యక్రమాన్ని ప్రజలు, ప్రధానంగా 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఒ)లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. బిఎల్ఒ ఆయా రోజుల్లో ఖచ్చితంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండి సమయపాలన పాటించాలని ఆదేశించారు.ఈ క్యాంపెయినింగ్ కార్యక్రమాన్ని ఆయా రోజుల్లో తమతో పాటు మండల, జిల్లా స్థాయి అధికారులు సందర్శించి కార్యక్రమం జరుగుతున్న తీరును సమీక్షిస్తారని తెలిపారు. సాయంత్రం ఐదు గంటల సమయానికి వచ్చిన దరఖాస్తులు వివరాలు, అభ్యంతరాల వివరాలను ఎన్నికల విభాగానికి అందజేయాలన్నారు.

27న జిల్లా స్థాయి జానపద పోటీలు

నెల్లిమర్ల: ఈ నెల 27న ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లో జిల్లా స్థాయి బాలరంగ్ సంప్రదాయ జానపద నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి చదువుతున్న, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తప్పెట గుళ్ళు, కర్ర సాము, చెంచుల వేట, థింసా, జాలరి, బంజారా వంటి జానపద నృత్య పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు. కాగా నృత్య పోటీల్లో పాల్గొనే వారు 10 మందికి మించి ఉండరాదని, 10 నిమిషాలు మాత్రమే ఉండాలని ప్రత్యక్ష సంగీతం మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు వివరాల కోసం పి. రవి కుమార్ సెల్ ఫోన్ 7989350244, కె. సత్యనారాయణ 8919985388 సంప్రదించాలని కోరారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

బొబ్బిలి: విశ్వనాథ గురుస్వామి వర్ధంతి సందర్భంగా అయ్యప్ప ఆలయం వద్ద గురువారం మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా విశ్వనాథ గురుస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని శంబంగి అన్నారు.

ఎ.టి. అగ్రహారంలో గ్రామ సందర్శన

నెల్లిమర్ల: మండలంలోని ఏటి అగ్రహారంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు గ్రామంలో పర్యటించి పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి, విద్యుత్ సరఫరా పరిశీలించి గ్రామ స్థాయి అధికారుల పని తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డి పి. శంకరగన్నాథం, రెవెన్యూ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

మెంటాడ: మండల యుటిఎఫ్ కార్యవర్గ సభ్యుల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నిక యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె విజయ గౌరి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జెవిఆర్కె ఈశ్వరరావులో సమక్షంలో నిర్వహించారు. యుటిఎఫ్ మండల నూతన గౌరవాధ్యక్షుడుగా బి. పైడిరాజు, అధ్యక్షుడిగా కె సన్యాసి రావు, ప్రధాన కార్యదర్శిగా కె సత్యనారాయణ, సహాధ్యక్షులుగా సిహెచ్ రవికుమార్, కోశాధికారిగా బి మురళీ, మహిళా అధ్యక్షులుగా కె నాగమణి, జిల్లా కౌన్సిల్ సభ్యులు టి.అశోక్‌కుమార్, ఎన్ పాపారావు, కె.చక్రధర్‌రావు, సిహెచ్ సత్యనారాయణ, పి రమణమూర్తి, ఆర్ సన్యాసిరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తూతూ మంత్రంగా రీసర్వే గ్రామసభలు

శృంగవరపుకోట: గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో అవకతవకలు ఉంటే తెలపాలంటూ గ్రామాల్లో పెడుతున్న రిసర్వేలు తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. గురువారం మండలంలోని ధర్మవరం గ్రామంలో జరిగిన రిసర్వేకు సంబంధించి ముందస్తుగా గ్రామస్తులకు తెలియపరచలేదు. రీ సర్వే లో బయటపడ్డ తప్పులు ఏమిటో ప్రజలకు తెలియకుండానే రీ సర్వేపై సందేహాలు, తప్పులు, సలహాలు ఉంటే ఇవ్వాలని గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు తూతూ మంత్రంగా సాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రిసర్వే జరిగిన లోపాల గురించి ప్రజలకు తెలియపరచకుండా సందేహాలు ఏవైనా ఉంటే తెలపాలని గ్రామ ప్రజలకు తెలియకుండా గ్రామసభ నిర్వహిస్తున్నారని మండలంలోని తిమిడి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు ఆరోపించారు. రీ సర్వే మాటున లొసుగులను అడ్డుపెట్టుకొని రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయమే జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు స్పష్టమైన ఆదేశాలి ఇచ్చి గ్రామ సభ నిర్వహించి సందేహాలను నివృత్తి చేయాలని సన్యాసినాయుడు కోరారు.

విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై శిక్షణ ఇస్తున్నట్లు హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నట్లు చెప్పారు. డాక్టర్ రాజ్‌కుమార్ విద్యార్థులకు నర్సింగ్‌కు సంబందించిన విషయాలు తెలిపారని వృత్తి విద్యా కోర్స్ ఉపాధ్యాయులు సూర్యకుమారి తెలిపారు.

26న బిఎస్‌పి ఆధ్వర్యంలో సభ

భోగాపురం: ఈ నెల 26వ తేదీన భారతదేశ రాజ్యాంగాన్ని సమర్పించిన దినోత్సవం సందర్భంగా సభను నిర్వహిస్తున్నట్లు బహుజన సమాజ్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం అధ్యక్షులు ఎరుకొండ వెంకట్రావు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను భోగాపురం ఎస్సి, బిసి కాలనీలో గురువారం విడుదల చేశారు. 26వ తేదీన తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఈ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పచ్చిపాల గురునాథరావు, పోతల సూరి పైడి, గుడివాడ సూరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నెల్లిమర్ల: సతివాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఈఈ కె.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో 33/11కెవి నిర్వహణ పనుల్లో భాగంగా గుర్ల మండలం వల్లాపురం వాటర్ వర్క్స్, ఫీడర్, అలుగోలు 11కెవి రూరల్ ఫీడర్, హృదయ అగ్రో 11కెవి ఫీడర్, ఒమ్మి 11కెవి రూరల్ ఫీడర్, రామ తీర్థం 11కెవి రూరల్ ఫీడర్, సతివాడ సబ్ స్టేషన్ 11కెవి ఎలౌసి మరమ్మత్తులు చేయనున్నామన్నారు. ఈ నేపథ్యంలో అలుగోలు, కొత్తూరు, పల్లిపేట, జోగిరాజుపేట, గుషిణి, చనమల్లపేట, బర్లపేట, సతివాడ, ఒమ్మి, బొప్పడాం, పిన తరిమి, పెద తరిమి, ఎంబెరయ్యగుళ్ళు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఆల్తిపాలెం, మాల్యాడ, వెంకన్న పాలెం, తమ్మాపురం, వల్లూరు, గుర్ల మండలం రాగోలు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాల పనివేళల మార్పు వద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉన్నత పాఠశాలలు పనివేలలు మార్పు చెయ్యడం వలన ఎలాంటి ప్రయోజనం లేదని, సత్ఫలితాలు కన్నా దుష్ఫలితాలు వస్తాయి కనుక పనివేళలు మార్పు చెయ్యవద్దని పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. రవీంద్ర నాయుడు, డి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నది సహేతుకమైన పని సమయమని, ఒకవేళ సాయంత్రం 5 గంటలువరకు స్కూల్ నడిస్తే ముఖ్యంగా దూరంనుంచి వస్తున్న ఆడపిల్లలు అసౌకర్యానికి గురవుతారని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెరగాలంటే, పనివేళలు మార్పుకాకుండా బడి వాతావరణం పిల్లలకు, ఉపాధ్యాయులకు ఆహ్లాదకరంగా ఉండాలన్నారు. యాప్స్ భారం తగ్గించి,తరగతి గదిలో ఉపాధ్యాయునికి తగిన స్వేచ్ఛ కల్పించాలన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ వార్డు పర్యటన

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

నగరంలోని 15వ డివిజన్‌లో నిర్వహించిన వార్డు పర్యటనలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు పాల్గొన్నారు. చిన్న పల్లి వీధి, పెద్దపల్లి వీధి, తెలకల వీధి, రామ మందిరం తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. నాలుగుచోట్ల వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయని, రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరారని చెప్పారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అల్లు చాణక్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీటి సరఫరా చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రామభద్రపురం

తాగునీటి సరఫరా సక్రమంగా అమలు జరిగేలా పంచాయతీ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు ఆదేశించారు. గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. స్వర్ణ గ్రామ పంచాయతీల్లో భాగంగా పన్నులు, పన్నేతరాలు వేర్వేరుగా అసెస్మెంట్ చేసి వెబ్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల ద్వారా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. చెత్త సేకరణ ఇంటింటా జరిపి తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టి జరిగేలా కృషి చేసి, ఇలా సమకూరే సంపద పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలన్నారు. గ్రామాల్లో వీధి దీపాలు, సక్రమ పారిశుధ్యం, పరిశుభ్రత, దోమల నివారణ వంటి వాటికి ప్రథమ ప్రాదాన్యత ఇవ్వాలనీ కోరారు. ఇంటి పన్ను వసూళ్ల ముమ్మరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రామభద్రపురం: అధికారులతో మాట్లాడుతున్న డిపిఒ

బాడంగి: డిపిఒ వెంకటేశ్వరరావు మండలాన్ని సందర్శించారు. స్వర్ణ గ్రామ పంచాయతీ విభాగంలో అప్లోడ్ చేయాల్సిన ట్యాక్స్, నాన్ టాక్సెస్, అసెస్మెంట్స్ అప్లోడింగ్ పైన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతానికి నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేపాడ: మండల పరిధిలో గల వీలుపర్తి గ్రామ సచివాలయాన్ని డిఎల్‌పిఒ మోహన్ రావు గురువారం సందర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వర్ణ పంచాయతీగా తీర్చిదిద్దుటకు ఉపయోగపడే పథకాలు అప్లోడ్ చేస్తున్న విధానాయాయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలను సిస్టంలో అప్లోడ్ చేయడం వల్ల అర్హులైన వారు అందరూ ప్రభుత్వ పథకాలు పొందడమే కాకుండా గ్రామం కూడా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ పరిశీలనలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న జీవన నైపుణ్యాలపై శిక్షణ

విజయనగరం టౌన్ :జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో విద్యార్థులకు 'సామాజిక అవగాహన-జీవన నైపుణ్యాలు' అనే అంశంపై ఒక్కరోజు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్,రాష్ట్ర నాయకులు డాక్టర్ పైల రమేష్ రాజు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురు వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబం ధించిన వివరాలు వెల్లడించారు. ఉత్తమ పౌర సమాజ స్థాపన, అందవి శ్వాసాలకు వ్యతిరేకంగా జెవివి విద్య,వైద్యం,వ్యవసాయ రంగం, శాస్త్రీయ దృక్పథం వంటి ఎన్నో అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.ఇందులో భాగంగా ఈనెల 23న విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

అధికారులు బలి పశువులు కావొద్దు

టిడిపి మండల నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎమ్మెల్యే మాధవి మాటవిని నిబంధనలను వ్యతిరేకించి పనులు చేపడితే ఊరుకునేది లేదని, అనవసరంగా అధికారులు బలి కావొద్దని టిడిపి మండల నాయకులు అధికారులను హెచ్చరించారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ రాధికతో పాటు పంచాయతీ రాజ్ ఇఇ శ్రీనువాసరావు, ఎపిఎం అచ్చుతరావు, ఎన్ఆర్ఇజిఎస్ పిఒ రత్నమాల, ఎంఇఒను టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మాజీ జెడ్‌పిటిసి ఆకిరి ప్రసాదరావు, విక్రం జగన్నాధం, సర్పం చులు, ఎంపిటిసిలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నియోజకవర్గానికి ఎమ్మెల్యే సుప్రీం గనుక ఆమెకు అన్ని విషయాలు తెలియాలి. మీరు చెప్పుకొండి.. కానీ మేము రూల్స్ ప్రకారం చేయమన్నవి కూడా ఆమె వద్దన్నారని, ఆమె దృష్టిలో పెట్టాలని సమాదానం చెబితే వెంటనే ధర్నా చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎమ్మెల్యే, టిడిపి నేతల మధ్య జరుగుతున్న విషయాలన్నీ అధికార్లుకు తెలిసిందేనన్నారు. నియోజకవర్గంలో 80 శాతం తాము ఉన్నామని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పొత్తు దర్మంలో భాగంగా ఆమెను గెలిపించామని గుర్తు చేశారు. ఆమె గెలుపు వెనుక ఉన్న పరిస్థితులు ఆమె మరచిపోయారన్నారు. నియోజకవర్గంలో గ్రామానికి ఇద్దరు పేర్లు పంపి వారు చెప్పిందే చేయాలని అధికార్లకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేయడం బాదాకరమన్నారు. పొత్తు ధర్మం పూర్తిగా ఆమె వదిలేసారన్నారు. మీరు కూడా ఏ కార్యక్రమమమైనా టిడిపి నాయకులకు, సర్పంచులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇకపై అలా జరిగితే ఊరుకోమన్నారు. ఏ కార్యక్రమం జరిగినా జనసేన వారితో పాటు టిడిపి నాయకులకు తెలియాలన్నారు. ఎందుకంటే తమది కూటమి అన్నారు. అధికారులు ఏకపక్షం వహిస్తే సహించేది లేదన్నారు. గ్రామాల్లో పనులన్నీ ఆపాలన్నారు. తామంతా ఒక కొలిక్కి వచ్చిన తరువాతే పనులు ప్రారంబించాలని జెఇకి తెలిపారు. లేదంటే తాము వచ్చి ఆపేస్తామన్నారు. వారితో పాటు మాజీ సర్పంచి పిన్నింటి సన్యాసినాయుడు, నాయకులు కొత్తకోట రమణ, లంకలపల్లి శ్రీనివాసరావు, సూర్యారావు, చందక ఆనంద్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై 26న శంఖారావం

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న శంఖారావం నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, పిసిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు, పట్టణ కళాసీ సంఘం నాయకులు వై. అప్పారావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం శంఖారావం ప్రచార పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులపై భారాలు వేస్తూ పాలన చేస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, ఎరువుల ధరలు పెంచి ప్రజలు, రైతులు నడ్డి విరుస్తున్న మోడీ గత పదేళ్లలో కార్పొరేట్ సంస్థలకు రూ.19.28లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని విమర్శించారు. కార్మికుల హక్కులపై దాడి చేసేందుకు లేబర్ కోడ్ చట్టాలను తీసుకు వచ్చారని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చారని చెప్పారు. కార్మిక చట్టాలను అమలు చేసి లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న బొబ్బిలి ఎన్‌టిఆర్ విగ్రహం జంక్షన్ నుంచి బజారు, మేధరబంద, చర్చి సెంటర్, శ్రీవేణు గోపాల స్వామి ఆలయం జంక్షన్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలుపుతామని చెప్పారు. నిరసన ర్యాలీను జయప్రదం చేయాలని కోరారు.



ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మారని పారిశుధ్య కార్మికుల జీవితాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వాలు ఎన్ని మారుతున్న గ్రామపంచాయతీ కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు రావడంలేదని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లా డారు.ఎన్నికల హామీలో భాగంగా పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం 18వేలు చెల్లిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, టెండర్లు రద్దు చేయాలని, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటి, పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను పరిష్కరించి కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వాధీనంలోనే కార్మికులను కొనసాగించాలని మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఆ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ సతీష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, చెలికాని ముత్యాలు మండలంలో గల గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

మండల స్థాయి పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - గజపతినగరం

ఈ నెల 26న జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు గురువారం స్థానిక మండల రిసోర్స్ కేంద్రంలో మండల స్థాయి వ్యాసరచన, పాటలు, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎంఇఒ 2 సాయి చక్రధర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఆయన తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో పి. హాసిని, నీరజ, డిబేట్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో కె రేష్మ, ఎ.జాహ్నవి, పాటల పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో కె. సరస్వతి, ఎ. చక్రవర్తి, వ్యాసరచన పోటీల్లో కె .శ్రీజ, ఇలదీప్ ప్రథమ, స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎ.పైడితల్లి, వ్యాయామ ఉపాధ్యాయులు ధార రాజు, సిఆర్పిలు పాల్గొన్నారు.

రామభద్రపురం:స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'భారత రాజ్యాంగం ఆవశ్యకత' అన్న అంశంపై 8,9,10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి పోటీలను నిర్వహించినట్లు ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. మండల స్థాయి వ్యాసరచన పోటీలో నవ్యశ్రీ ప్రథమ, గోపిక శ్రీవల్లి ద్వితీయ స్థానాల్లోనూ, వక్తృత్వ పోటీల్లో కెజిబివికి చెందిన లలితకుమారి దేవి ప్రథమ, ద్వితీయ, అదే పాఠశాలకు చెందిన సుమతి, మానస పాటల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, చిత్రలేఖనంలో శైలజ, దేవి ప్రథమ ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ విద్యార్థులు శుక్రవారం విజయనగరం మహారాజా సంస్కృత కళాశాలలో జరగనున్న జిల్లాస్థాయి పోటీలకు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఎంఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి హెచ్ఎం నాగ భూషణరావు, దాలినాయుడు, ప్రభాకర్రావు, మురళీ, శశిభూషణరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పలనాయుడికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- బాడంగి

విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా కొల్లి అప్పలనాయుడు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సంబంధిత శాఖ జాయింట్ డైరెక్టర్ ఉమాదేవి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బేబీనాయన, బండారు సత్యనారాయణమూర్తి, కోళ్ల లలితకుమారి, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వెడిఒ అధినేత చల్ల కృష్ణ, తెలుగు రాష్ట్రాలకు చెందిన కొప్పుల వెలమ సంఘ నాయకులు హాజరై అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో కొప్పుల వెలమల సమస్యల పరిష్కారంతోపాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యపరంగా ఎదిగేలా తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా కొల్లి అప్పలనాయుడు తెలిపారు.

ఎస్‌జిహెచ్ ఇన్‌కమ్ ప్రొఫైల్ సర్వే పరిశీలన

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని కాటకాపల్లిలో జరుగుతున్న ఎస్‌జిహెచ్ ఇన్‌కమ్ ప్రొఫైల్ సర్వేను డిఆర్‌డిఎ అదనపు పథక సంచాలకులు కె. సావిత్రి పరిశీలించారు. సంఘాలు పెట్టి సుమారు 25 సంవత్సరాల నుంచి నడుస్తున్న సభ్యులు చాలా సార్లు బ్యాంకు అప్పులు, స్త్రీనిధి, రకరకాల అప్పులు తీసుకొని ఏ విధంగా అభివృద్ధి చెందరో వివరించారు. ప్రతీ చిన్న సంఘంలో ప్రతీ నెలా సమావేశాలు ఏర్పాటు చేయాలని, పుస్తకాలను రాసుకోవాలని, లీడర్లును ప్రతీ సంవత్సరం మార్చాలని సభ్యులందరికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి పైడి నాయుడు, డిపిఎం ఫైనాన్స్ జె.లక్ష్మంనాయుడు, స్త్రీనిధి ఎజిఎం యు. ఉమామ హేశ్వరరావు, ఎపిఎం పి.విజయలక్ష్మి, ఎల్.కోట ఎపిఎం జి. శ్రీనివాసరావు, జామి ఎపిఎం జివిపి దేవి, కొత్తవలస ఎపిఎం ఎ. వెంకటరమణ, సిసిలు అప్పలస్వామి, రమణ, భారతి, పాల్గొన్నారు

సిటియులో రసాయనశాస్త్ర పురోగతిపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ అవుట్‌రీచ్ 'రసాయన శాస్త్రాలలో అభివద్ధి' అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. తాజా రసాయన శాస్త్ర పరిశోధనలు, విద్యా సహకారం, విద్యార్థుల పరిశోధనా సామర్థ్యాల అభివృద్ధి వంటి ముఖ్య అంశాలపై లెక్చర్స్ ఉంటాయి. యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభోత్సవ సమావేశంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ ప్రధాన సంపాదకులు ప్రొఫెసర్ ఎస్. నటరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో తాజా పురోగతుల ప్రాధాన్యతను వివరించారు. రసాయన శాస్త్ర అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలస్తంభం అని పేర్కొన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.వి. కట్టిమని మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్నతమైన లక్ష్యాలను సాధించడంలో విశ్వవిద్యాలయ పాత్రపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు డాక్టర్ కె.సురేష్ బాబు, ప్రొఫెసర్ ఎం. శరత్‌చంద్ర బాబు, కిశోర్ పడాల నిర్వహించారు.

ఖోఖో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని గరికివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జిఎఫ్ అండర్ 14 ఖో ఖో పోటీల స్టేట్ టీమ్‌కు పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు మండల ధన లక్ష్మీ, నడుపురు కుసుమ ఎంపికైనట్లు పాఠశాల పిఇటి మల్లిఖార్జనరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు పల్నాడు జిల్లా కరంపూడి గ్రామంలో ఈ క్రీడలు జరుగుతాయన్నారు. ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల సిబ్బంది, బాలల హక్కుల పరి రక్షణ చైర్మన్ కేసలి అప్పారావు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఘనంగా ప్రపంచ టెలివిజన్ డే

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ టెలివిజన్ డే కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఏ హుస్సేన్ టెలివిజన్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఏ అర్జున్‌రావు మాట్లాడుతూ టెలివిజన్ వల్ల ప్రజల మధ్య మానవతా విలువలు, ప్రపంచ స్థాయిలో అవగాహన పెంపొందించే వేదికగా మారిందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అపార్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అపార్ కేంద్రాన్ని ఎంఇఒ పి.బాల భాస్కరరావు గురువారం సందర్శించారు. ఈ కేంద్రాల్లో పేరు, పుట్టిన తేదీ, మార్పులు చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం కడకొండ, చిన దుంగాడ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. అక్కడ పరిసరాలు, మధ్యాహ్నభోజన పథకాలను పరిశీలించారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్‌పురం సచివాలయాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయానికి సంబంధించిన రికార్డులను సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను, సిబ్బంది డైరీలను పరిశీలన చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ మాట్లాడుతూ విధులకు సకాలంలో హాజరు కావాలని, సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని గ్రామంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. హౌస్ ఓల్డ్ సర్వే సక్రమంగా నిర్వహించాలని గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిని పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

బైరిపురంలో సోషల్ ఆడిట్

మెరక ముడిదాం: గ్రామ స్థాయిలో జరుగుతున్న ఉపాధి పనులకు సంబంధించిన రికార్డ్స్ నిర్వహణ బాగుందని సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్ అధికారి నరసింగిరావు అన్నారు. గురువారం మండలంలోని బైరిపురం గ్రామంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన 81 పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోషల్ ఆడిట్ అధికారి నరసింగిరావు బైరిపురం గ్రామ పంచాయతీలో జరిగిన సుమారు రూ.1.30 కోట్ల పనులపై సమీక్షించారు. గ్రామ స్థాయిలో ప్రతి ఒకటి పరిశీలించామని, ప్రతి ఒక్కరిని పనులు గురించి ఆరా తీశామని బాగా జరిగినట్లు తెలపటమే కాకుండా క్షేత్ర స్థాయిలో కూడా పరిశీలించామని చెప్పారు. ముఖ్యంగా పనులకు సంబంధించిన రికార్డ్స్ నిర్వహణ, సెవెన్ రిజిస్టర్స్ నిర్వహణ చాలా బాగుందని గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బూడు శ్రీనివాసరావును అభినందించారు. సమావేశంలో గ్రామ ఉప సర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కె. ధనంజయ్, ప్రాల్గొన్నారు.

ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవాలి

ప్రజాశక్తి- భోగాపురం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలంటే ప్రతి ఒక్కరూ ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవాలని పోస్టల్ అసిస్టెంట్ సూపరిండెంట్ పి.సుందరనాయుడు గురువారం తెలిపారు. మండలంలోని భోగాపురం, చాకివలస గ్రామాల్లో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, మాతృ వందనం, ఉపాధి కూలీలకు వేతనాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, గ్యాస్ సబ్సిడీలు వంటి పథకాలు లబ్ధి పొందాలంటే ఎన్‌పిసిఐ లింక్‌ను దగ్గరలో ఉన్న పోస్టల్ కార్యాలయంలో చేసుకోవాలని తెలిపారు. కొత్త ఖాతాదారులకు 200 రూపాయలతో ఖాతాలు తెరుచు కోవచ్చని తెలిపారు. కొత్తగా ఖాతాలు తెరిచిన లబ్ధిదారులకు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది శ్రీనివాసరావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

మద్యం ధరలు పెంచితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

మద్యం ధరలు పెంచి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు అన్నారు. మద్యం షాపులు వద్ద ఎమ్మార్పీ ధరలు పట్టికను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం వ్యాపారులు ఎమ్మార్పీ ధరలకు మాత్రమే మద్యాన్ని అమ్మాలని చెప్పారు. ధరలు పెంచి అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎఫర్టబుల్ లిక్కర్ రూ.99కు అమ్మాలని చెప్పారు. బెల్ట్ షాపులకు మద్యం ఇచ్చినా కేసులు నమోదు చేస్తామన్నారు.

ఐదుగురుపై బైండోవర్ కేసులు

నాటుసారా, బెల్ట్ షాపులు నిర్వహించి మద్యం అమ్ముతున్న ఐదుగురుపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురుపై బైండోవర్ కేసు పెట్టి తహశీల్దార్ వద్ద హాజరు పరిచినట్లు చెప్పారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి గ్రామానికి చెందిన నాజానా పాపినాయుడు బుధవారం సాయంత్రం అనుమాన్పాదంగా మృతి చెంది నట్లు బుధరాయవలస ఎస్ఐ లోకేష్ తెలిపారు. మృ తుడు పాపినాయుడు గ్రామంలోనే కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాడు. మంగళ వారం ఆ గ్రామానికి చెందిన ఈశ్వరరావుతో గొడవ పడ్డాడు. బుధవారం సాయంత్రం అతని ఇంటి వద్దనే పాపినాయుడు మృతి చెంది ఉన్నట్లు అతని అన్న నాజానా సూర్యనా రాయణ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అక్రమ రవాణా వాహనం పట్టివేత

నెల్లిమర్ల: పశువుల అక్రమ రవాణా వాహనాన్ని గురువారం స్థానిక రామతీర్థం జంక్షన్ పూడమ్మ తల్లి గుడి వద్ద ఎస్ఐ బి.గణేష్ పట్టుకున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని జప్తు చేసి పశువులను గోశాలకి తరలించి కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం కోట: నగర పరిధిలో గల అయ్యకోనేరు తూర్పు గట్టువద్ద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడంతో స్థానికుల సమాచారం మేరకు బుధవారం టూ టౌన్ పోలీసులు 108 వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని మహారాజా ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉంచినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121109420 నెంబరును సంప్రదించాలని కోరారు.

రెండు గ్రూపుల మధ్య కొట్లాట

బొబ్బిలి: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ లో రెండు గ్రూపుల మధ్య కొట్లాట జరిగింది. ప్రేమ విషయంలో గురువారం సాయంత్రం విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి గొడవ పడ్డారు. దీంతో కాంప్లెక్స్ నుంచి బస్సులు బయటకు వెళ్లలేదు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులకు సమాచారం అందడంతో కాంప్లెక్స్ వద్దకు చేరుకుని ఇరు గ్రూపులను మండలించడంతో గొడవ సద్దుమణిగింది.